భయపెడుతున్న కల్తీ బెల్లం

- మార్కెట్లో కెమికల్స్‌తో తయారు చేసిన బెల్లం విక్రయాలు
- రాజాం నియోజకవర్గంలో సహజసిద్ధంగా తయారవుతున్న బెల్లం
- దీనికి డిమాండ్ ఉండడంతో ఇతర ప్రాంతాలకు ఎగుమతి
- ఇతర ప్రాంతాల్లో కెమికల్స్‌తో తయారవుతున్న కల్తీ బెల్లం ఇక్కడికి దిగుమతి



రాజాం మార్కెట్‌లో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కల్తీ బెల్లం

రాజాం: ప్రజలు ఆరోగ్యవనరుగా భావించే బెల్లం సైతం ఇప్పుడు ప్రమాదకరంగా మారుతోంది. సహజసిద్ధమైన బెల్లం కెమికల్ కుంపటితో తయారవుతోంది. రాజాం నియోజకవర్గంలో తయారయ్యే బెల్లం ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుండగా..జిల్లాతో పాటు పక్క జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కెమికల్స్, మొలాసిస్ వ్యర్థాన్ని ఉపయోగించి తయారు చేస్తున్న బెల్లం తక్కువ ధరకు లభిస్తుండడంతో ఇక్కడి వ్యాపారులు దానినే కొనుగోలు చేసి ప్రజలకు విక్రయిస్తున్నారు. కల్తీ బెల్లాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యం కంటే అనారోగ్య సమస్యలు అధికంగా ఉంటాయని నిపుణులు వెల్లడిస్తున్నారు.

పోలిక తెలియదు



కెమికల్ బెల్లానికి, సాధారణ బెల్లానికి తేడా పసిగట్టలేం. రాజాంతో పాటు చుట్టు పక్కల మార్కెట్‌కు కెమికల్‌తో తయారైన బెల్లం వస్తుంది. ఈబెల్లానికి చీమ లు కూడా పట్టవు. రుచి ఉండదు. ఈబెల్లాన్ని కనిపెట్టడం కూడా కష్టమే. మొలాసిస్, సున్నం కలిపిన ముడిసరుకుతో ఈ బెల్లం తయారీ ఉంటుంది.

– గేదెల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు, ఉనుకూరు, రేగిడి మండలం.

తగ్గిన ఉత్పత్తి.. ఇతర ప్రాంతాలకు ఎగుమతి

గతంలో సహజసిద్ధ బెల్లం అనగానే రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి, రేగిడి, వంగర మండలాలు గుర్తు కొచ్చేవి. ఈ మండలాల్లో చెరకు సాగు అధి కంగా ఉండడంతో పాటు బెల్లం తయారీ ఉంటుంది. చిన్నపాటి కెమికల్‌ని కూడా వినియోగించకుండా జావాం, హొంజరాం, బూరాడపేట, చిత్తారిపురం, ఖండ్యాం, కొమెర తదితర ప్రాంతాల్లో బెల్లాన్ని తయారు చేస్తుంటారు. ఇప్పటికీ ఇక్కడి బెల్లానికి అదే తరహా డిమాండ్ ఉంది. అయితే ఇక్కడ తయారయ్యే బెల్లం ఈ ప్రాంతంలో వినియోగదారులకు లభించడంలేదు. క్వింటా ధర రూ.4 వేల పైబడి పలుకు తుండడంతో ఈ బెల్లాన్ని విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు ఎగుమతిచేస్తున్నారు. దీంతో వ్యాపారులు వినియోగదారులకు తక్కువ ధరకు బెల్లాన్ని కొనుగోలుచేసి, లాభాలు పొందేందుకు ఇతర ప్రాంతాల నుంచి బెల్లాన్ని ఇక్కడికి దిగుమతిచేస్తున్నారు. ఈ బెల్లమే ఇప్పుడు రాజాంలోని పలు వ్యాపార దుకాణాల్లో దర్శనమిస్తోంది. నియోజకవర్గంలో గతంలో కంటే ప్రస్తుతం చెరకుపంట సాగు పడిపోయింది. ఉన్న చెరకును సంకిలి ఫ్యాక్టరీకి తరలించగా, మిగిలిన కొద్దిమొత్తాన్ని మాత్రమే బెల్లం తయారు చేస్తున్నారు. దీంతో ఉత్పత్తిలేక ఇక్కడి బెల్లానికి డిమాండ్ పెరగడం మరో కారణంగా మారింది.

మొలాసిస్‌తో..

మొలాసిస్ వ్యర్థాన్ని చెరకు గానుగలో వేయడం ద్వారా బెల్లం మంచి రంగులోకి వస్తుంది. ఈవిధానాన్ని జిల్లాతో పాటు పక్క జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో బెల్లం తయారీదారులు పాటిస్తున్నారు. సంకిలి ఫ్యాక్టరీ వద్ద మొలాసిస్ వ్యర్థాన్ని పంటకు ఎరువు కోసమని కొనుగోలు చేసి బెల్లం తయారీలో వినియోగిస్తున్నారని తెలుస్తోంది. మొలాసిస్ వ్యర్థాలు వినియోగించడం ద్వారా ముడిసరుకు తక్కువగా ఉండి, బెల్లం ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే ఆ బెల్లాన్ని క్వింటా రూ.3 వేలకు విక్రయిస్తున్నారు.రాజాంలో వ్యాపారులు ఆ బెల్లాన్ని కొనుగోలుచేసి విక్రయాలు చేస్తున్నట్లు పలువురు అనుమానిస్తున్నారు. నాణ్య మైన జావాం, ఖండ్యాం, హొంజరాం ప్రాంతాల బెల్లాన్ని అడగగా, ఈ కెమికల్ బెల్లాన్నే కట్టబెడుతున్నారని కొనుగోలు దారులు వాపోతున్నారు.ఆహార భద్రతా అధికారుల తనిఖీలు లేకపోవడంతో ఈ కెమికల్ బెల్లం హాట్ కేక్‌లా అమ్ముడిపోతోంది.

క్లుప్తంగా

హెచ్‌ఎం సంగమేశ్వరరావుకు సన్మానం



హెచ్‌ఎం సంగమేశ్వరరావును సన్మానిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

తెర్లాం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,మండలంలోని నెమలాం హైస్కూల్ హెచ్‌ఎం దాకోజు వెంకట సంగమేశ్వరరావును మండల కేంద్రంలోని ఆయన నివాసంలో తెర్లాం వాకర్స్‌క్లబ్ సభ్యులు సోమవారం సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సంగమేశ్వరరావు వాకర్స్ క్లబ్‌లో సభ్యుడిగా ఉండడంతో తోటి సభ్యులు ఆయనకి అభినందనలు తెలిపి సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకో వాలని ఆకాంక్షించారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేస్తున్న హెచ్‌ఎం మహేశ్వరరావు, ఉపాధ్యాయుడు నాయుడు తదితరులు

రాజాం: మండలంలోని పెనుబాక ఉన్నత పాఠశాలలో వందమంది విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఆర్.వి.జె.నాయుడు సోమవారం పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఉపాధ్యాయుడు ఆర్.వి.జె.నాయుడు తన పుట్టిన రోజు సందర్భంగా సమకూర్చిన ఈ విద్యాసామగ్రిని హెచ్‌ఎం మహేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జాషువా

బొబ్బిలిరూరల్: భారతరత్న, ఇంజినీరింగ్ నిపుణుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా పిరిడి గ్రామం వద్ద ఉన్న గోకుల్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా, అధ్యాపకులు పూలమాలల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వ రయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని, సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు.


పెదశిర్లాంలో నేత్రవైద్యశిబిరం



వృద్ధుడికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి పూజిత

రేగిడి: మండల పరిధిలోని పెదశిర్లాం గ్రామంలో విజయనగరానికి చెందిన వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన పెద్దశిర్లాం, చిన్నశిర్లాం, అంబాడ, వెంకటాపురం తదితర గ్రామాలకు చెందిన 90 మందికి ఆప్తాలమిక్ అధికారి పూజిత కంటి పరీక్షలు చేసి 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సర్పంచ్ లెంక రాంబాబు, శిబిరం సమన్వయకర్త లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాజాం సిటీ: అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తినాయుడు, అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకుమారి, పుణ్యవతి డిమాండ్ చేశారు. రాజాంలోని గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరారు. ఈ ఏడాది జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చిన ప్రభుత్వం ఇంత వరకు దానిగురించి ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమ, వేణుకుమారి, రమణమ్మ, శ్రీదేవి, నారాయణమ్మ, లావణ్య, విజయ, వరలక్ష్మి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మెంటాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళ వా రం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ భానుమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన నిర్వహించనున్న ఈసమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వస్థలం లీజు ఒప్పందాన్ని రద్దుచేయాలి



మీడియాతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శంకరరావు

బొబ్బిలి: జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వస్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబె ట్టడంలో ప్రభుత్వం ఆంతర్యమేమిటని సీపీఎం జిల్లా కార్యదర్శి పొట్నూరు శంకరరావు ప్రశ్నించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ వద్ద లీజుకు కట్టబెడుతున్న స్థలాన్ని సోమవారం వివిధ ప్రజా సంఘాల నాయకులు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా మీడియాతో శంకరరావు,తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న దాదాపు రెండెకరాల స్థలాన్ని లీజు ప్రాదిపదికన స్థానిక జీజేపీ నాయకుడికి కట్టబెడుతూ ప్రభుత్వం ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సింది పోయి ప్రభుత్వమే అమ్ముకుంటోందని విమర్శించారు. వెంటనే లీజు అగ్రిమెంట్‌ను రద్దుచేసి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు,హాస్టళ్లను ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తూ వేల రూపాయల అద్దెలను చెల్లిస్తున్నారని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వాటి కోసం సద్వినియోగం చేసుకోక పోగా ప్రైవేటు వ్యక్తుల వ్యాపారాల కోసం అందించడం సిగ్గుచేటని, ఇది దుర్మార్గపు చర్యని దుయ్యబట్టారు.ప్రభుత్వ స్థలాన్ని కూటమి నాయకుడికి ధారాదత్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లీజు ఒప్పందాన్ని రద్దుచేయని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని తెలిపారు. నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ మువ్వల శ్రీనివాసు, రైతు సంఘం జిల్లా నాయకులు గోపాలం,తదితరులు పాల్గొన్నారు.

రణభేరి జాతాను జయప్రదం చేయండి



సంగాం హైస్కూల్‌లో రణభేరి జాతా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

వంగర: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న బొబ్బిలిలో నిర్వహించనున్న రణభేరి బైక్ జాతాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.గౌరిశంకర్ పిలుపునిచ్చారు. వంగర, సంగాం, ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సోమవారం వారు సందర్శించి, ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 19 వరకు రణభేరి బైక్ జాతాను నిర్వహిస్తున్నామని, బొబ్బిలిలో బుధవారం నిర్వహించనున్న జాతాకు ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. యూటీఎఫ్ మండల కోశాధికారి బి.శ్రీనివాసరావు, సభ్యులు కె.రమణ, పి.మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ ఉమామహేశ్వరి, తదితరులు

సంతకవిటి: మండలంలోని హొంజరాం పంచాయతీ బూరాడపేట గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై రాజాం హెచ్‌ఓ సీహెచ్.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను రేగిడి మండలంలో ఉన్న శ్రీనివాసా పామ్ ఆయిల్ కంపెనీ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ పంటలో అంతర పంటలు సాగుచేసుకో వచ్చని,తద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. శ్రీనివాసా పామ్ ఆయిల్ కంపెనీ సూపర్ వైజర్ వీరబాబు మాట్లాడుతూ ఆయిల్ పామ్ పిక్కలు టన్ను ధర రూ.19,095 ఉందని, పంటను కొనుగోలు చేసిన పదిరోజుల లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు.

రేపటి నుంచి స్వస్థ్ నారీ -స్వశక్తిపరివార్'

రేగిడి: మండలంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థ్‌నారీ–స్వశక్తిపరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.ఆసిరినాయుడు తెలిపారు. పీహెచ్‌సీలో సిబ్బందితో పాటు మండలంలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. స్వస్థ్ నారీ–స్వశక్తిపరివార్ అభియాన్ కార్యక్రమం గురించి వివరించారు. గ్రామాల్లో మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటిక్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ తదితర స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని, అలాగే కిశోరబాలికలు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచించారు. వైద్యాధికారి సోహినీరాఘవ్, సీహెచ్‌ఓ సుందరేశ్వర్, పీహెచ్‌ఎన్ నిర్మలాదేవి, సూపర్‌వైజర్ అప్పారావు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఆటోల బంద్ రేపు



తెర్లాం: మాట్లాడుతున్న శంకరరావు, ఆటోడ్రైవర్లు

బొబ్బిలి/తెర్లాం: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న ఆటో, టాటా మేజిక్‌ల జిల్లా బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శంకరరావు ఆటో కార్మికులను కోరారు. బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటోస్టాండ్‌లో, తెర్లాం గ్రామ సచివాలయం–1 వద్ద ఆటో డ్రైవర్లతో సోమవారం సమావేశమయ్యారు. బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వచ్చేనెల 1న ఇస్తామని ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని రూ.15వేల నుంచి రూ.25వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. టోలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వమే ఉచితంగా మంజూరు చేయాలన్నారు. బంద్‌లో భాగంగా బొబ్బిలి, తెర్లాం మండల కేంద్రాల్లో బుధవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో అన్ని గ్రామాల ఆటో, టాటా మేజిక్ వాహనాల డ్రైవర్లు పాల్గొనాలని కోరారు. ఆటో డ్రైవర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం



వివిధ వేషధారణలతో వేడుకలకు హాజరైన విద్యార్థులు

రామభద్రపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వి.గోపాలనాయుడు,హిందీ పండిట్‌లు వి.విజయలక్ష్మి,బి.నళిని ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహిం చారు.విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా వేషధారణలతో ఆకట్టుకున్నారు. దేశభక్తి గీతాలు ఆలపించడంతో పాటు, వివిధ నాటికలు ప్రదర్శించారు.హెచ్‌ఎం మాట్లాడుతూ హిందీ భాష వస్తే భారతదేశంలో ఎక్కడైనా పర్యటించడంతో పాటు బతికేయవచ్చని అన్నారు.పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలతో విద్యారంగం నిర్వీర్యం



రణభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్, తదితరులు

రామభద్రపురం: విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు ఉన్నాయని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ అన్నారు. బూసాయవలస ఉన్నత పాఠశాలలో సోమవారం పలువురు ఉపాధ్యాయులతో కలిసి యూటీఎఫ్ రణభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఇవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బకాయిలు చెల్లించాలని,ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై శ్రీకాకుళంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన రణభేరి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు,అలాగే ముఖ్య నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

యూరియా కోసం ఎన్నాళ్లీ అవస్థలు..?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



ఎరువుల కొరతపై ఏఓ శివను నిలదీస్తున్న సర్పంచ్‌లు

రామభద్రపురం: యూరియా కోసం రైతులు ఎన్నాళ్లు అవస్థలు పడాలని, రైతులకు సరిపడా యూరియాను సకాలంలో సరఫరా చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫల మైందని మండల సర్వ సభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఏకరువు పెట్టారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు భవనంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు.అధికారులు శాఖల వారీగా నివేదికలు చదివి వినిపించారు మండల వ్యవసాయ అధికారి(ఏఓ) ఎం.శివ తన నివేదిక వెల్లడిస్తుండగా మామిడివలస సర్పంచ్ మూడడ్ల అప్పలనాయుడు,మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు కలుగజేసుకుని నాలుగు ఎకరాలు ఉన్న రైతుకు ఒక బస్తానే, పదిసెంట్లు భూమి ఉన్న వారికి ఒక బస్తాయే యూరియా ఇస్తున్నారని ఏఓపై ధ్వజమెత్తారు. పంటకు సకాలంలో ఎరువు వేయకుంటే దిగుబడులు తగ్గి రైతు నష్టాల పాలవుతాడని మండిపడ్డారు. గతంలో సరఫరా చేసినట్లుగా సీజన్‌కు ముందుగానే ప్రణాళికలు వేసుకుని సరిపడా సరఫరా చేయాలే తప్ప అరకొర తెచ్చి రైతులను దెబ్బలాడుకోమంటే ఎలా అని ప్రశ్నించారు.అదును దాటాక తెచ్చి పంపిణీ చేసినా ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్ సాగర్ తన నివేదికలు వెల్లడిస్తు ఏమైనా సమస్యలున్నాయా అని అడగడంతో బూసాయవలస టీడీపీ ఎంపీటీసీ మడక తిరుపతినాయుడు జోక్యం చేసుకుని పెద్దగెడ్డ నీరు వదిలామని చెప్పడమే కాని చుక్క నీరు పొలాలకు రాలేదని,పంటలు పాడయ్యాక నీరు వచ్చినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది


ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్త చర్యలు తీసుకునేలా చూడాలని డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణను రామ భద్రపురం–2,3 టీడీపీ ఎంపీటీసీలు వసంతుల తిరుపతిరావు,బవిరెడ్డి చంద్ర కోరారు. మేజర్ పంచాయతీ రామభద్రపురంలో వీధి కాలువలు పూడిక, చెత్తతో నిండి ఉన్నాయని అన్నారు. అలాగే బైపాస్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు లైట్లు లేకపోవడంతో రాత్రి పూట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎన్ని సార్లు చెప్పినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈఏడాది రెండో విడత 15 ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ఖాతాలో పడ్డాయని ముందుగా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వాలని డిప్యూటీ ఎంపీడీఓ చెబుతుండగా రొంపల్లి టీడీపీ సర్పంచ్ కలుగజేసుకుని గత ఏడాదిన్నరగా పంచాయతీలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, వేతనాలు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సత్యనారాయణను పలు పంచాయతీల ఎంపీటీసీ సభ్యులు కోరారు. అలాగే ఉపాధి హామీ, ఐసీడీఎస్, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాదరావు, తహసీల్దార్ అజు రఫీజాన్, ఉపాధిహామీ ఏపీఓ త్రినాథరావు, ఐసీడీఎస్ పీఓ వరహాలమ్మ, ఎంఈఓ తిరుమలరావు,హౌసింగ్ ఏఈ వెంకటేష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్ కుమార్,అపర్ణ, పశువైద్యాధికారి అప్పలనాయుడు ఎంపీడీఓ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

గురజాడ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలి

బొబ్బిలి: మహాకవి గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని కోరుతూ జిల్లా పౌరవేదిక బృందం స్థానిక కోటలో ఎమ్మెల్యే బేబీనాయనను సోమవారం కలిసి వినతిపత్రం అందజేసింది.పౌర వేదిక జిల్లా అధ్యక్షు డు బీశెట్టి బాబ్జి మీడియాతో మాట్లాడుతూ ప్రముఖుల జయం తి కార్యక్రమాలను రాష్ట్ర ఉత్సవాలుగా నిర్వ హించే ప్రభుత్వం గురజాడ జయంతిని అందులో చేర్చకపోవడంతో జిల్లా ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారని అన్నారు. సెప్టెంబరు 21న గురజాడ 163వ జయంతి అని, ఆ కార్యక్ర మాన్ని రాష్ట్ర ఉత్సవంలా నిర్వ హించాలని జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలను కలిసి వినపత్రాలు అందజేస్తున్నామని చెప్పారు. ప్రజాభి ప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 17న గురజాడ విగ్రహం వద్ద దీక్ష చేపట్టనున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పౌరవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ పిడకల ప్రభాకరరావు,ఈ.గోపి,టి.రామ్మోహనరావు, తాత్రాజు రాజారావు ఉన్నారు.

పశువులకు టీకాలు



బాడంగి: పాల్తేరులో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యసిబ్బంది

తెర్లాం/బాడంగి: తెర్లాం మండలంలోని పెరుమాళి, నెమలాం, ఉద్దవోలు, తదితర గ్రామాల్లో, బాడంగి మండలంలోని పాల్తేరు, డొంకి నవలస తదితర గ్రామాల్లో పాడిపశువులకు ఆయా మండలాల పశువైద్యాధికారులు జె.నరేంద్రకుమార్, ఎం.సతీష్ ఆధ్వర్యంలో సోమ వారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడిరైతులకు వివరించారు.

సచివాలయ సిబ్బంది సమస్యలపై వినతి

సంతకవిటి: వలంటీర్ క్లస్టర్లలో సచివాలయ ఉద్యోగులను పనిచేయించడాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసు కోవాలని డెమోక్రటిక్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి కిరణ్‌కుమార్ కోరారు.ఈమేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఏఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు.

వినతులకు తక్షణం పరిష్కారం చూపాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ రామారావు

వంగర: గ్రామాల్లో భూసమస్యలపై రైతులు అందించే వినతులకు తక్షణం పరిష్కారం చూపాలని తహసీల్దార్ పిన్నింటి రామారావు వీఆర్‌ఓలకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు.భూరీ సర్వే చేపట్టిన గ్రామాల్లో సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించాలని ఆదేశించారు. వీఆర్‌ఓలు గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. డీటీ రుంకాన శ్రీనివాసరావు, ఆర్‌ఐ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణకు భారత్ గౌరవ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అన్నపూర్ణ

రామభద్రపురం: రాజస్థాన్‌కు చెందిన ఈసస్ చారిటబుల్ ట్రస్టు స్థానిక కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్ శతపతి అన్నపూర్ణకు భారత్ గౌరవ్ అవార్డు ప్రదానం చేసింది. జైపూర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రాజస్థాన్ మేయర్ డాక్టర్ సౌమ్య,గుర్జార్ శాసనసభ్యులు రామ్ సహాయ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్టు అన్నపూర్ణ సోమవారం సాక్షికి తెలిపారు. మహిళా సాధికారత, ఆరోగ్య శిబిరాల నిర్వహణ,పర్యావరణ పరిరక్షణ తదితర సేవలకు ఈ అవార్డు లభించిందని ఆమె చెప్పారు. ఆమెను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, తదితరులు అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

బొబ్బిలి: ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల్లో టీడీపీ కూటమి హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా నేటికీ తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఏపీటీఎఫ్ నాయకులు అన్నారు. పట్టణంలో ఎమ్మెల్యే బేబీనాయనను సోమవారం కలిసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు జేసి రాజు,రమేష్ మాట్లాడుతూపెండింగ్ డీఏలను చెల్లించాలని, సీపీఎస్ రద్దుచేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

పక్కా ప్రణాళికతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

బొబ్బిలిరూరల్: సర్పంచ్‌లు, అధికారులు ప్రణాళికలు రూపొందించుకుని, పక్కాగా వాటిని అమలు చేసినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో బొబ్బిలి నియోజకవర్గంలోని బొబ్బిలి,బాడంగి మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లకు గ్రామాభివృద్ధి ప్రణాళికలు,బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శులను తీర్చిదిద్దడం, తదితర అంశాలపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సుస్థిర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని అన్నారు. బాడంగి ఎంపీడీఓ రామకృష్ణ, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.